క్లుప్తంగా

'అధైర్యపడొద్దు.. అండగా ఉంటా'

ఆత్మకూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందామని అధైర్యపడకుండా రెట్టింపు స్థాయిలో ముందుకెళ్దామని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ నైతిక విజయం సాధించిందని, నియోజకవర్గంలో అద్భుత శక్తిగా ఎదిగాన్నారు. కార్యకర్తల శ్రమ కృషి ఫలితంగానే తనకు 46వేల ఓట్లు లభించాయని, అదే ధైర్యంతో ముందుకు సాగుదామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలుపుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

విద్యార్థికి ఆర్థికసాయం



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన మహేశ్వరి బీఎస్సీ నర్సింగ్ చదవడానికి అర్హత సాధించారు. ఆమె ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి రూ.15వేలు పంపించారు. స్థానిక నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం నగదును విద్యార్థిని మహేశ్వరికి అందించారు. కార్యక్రమంలో రాజశేఖర్, వెంకట్రాములు, సునీల్, జగదీశ్వర్‌రెడ్డి, రాముడు, అశోక్, వినయ్‌రాజు, సత్యం, రాముడు తదితరులు పాల్గొన్నారు.

అభినవ గాంధీ నెల్సన్ మండేలా



వనపర్తి టౌన్: జాతి వివక్షతకు గురవుతున్న నల్ల జాతీయులకు విముక్తి కల్పించిన అభినవ గాంధీ నెల్సన్ మండేలా అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మంగళవారం టీజేఏసీ ఆధ్వర్యంలో నెల్సన్ మండేలా 11వ వర్ధంతి వేడుకలను జరుపుకొన్నారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా వివక్షతకు గురవుతున్న ప్రజలకు స్వేచ్ఛావాయువులను అందించిన శాంతిదూతగా నెల్సన్ మండేలా చరిత్రలో నిలిచారని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా జాతి విముక్తి పోరాటాలకు వెలుగు బాటలు పరిచిన మన కాలపు మహాత్ముడు మండేలా అని చెప్పారు. కార్యక్రమంలో కవులు గిరి రాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, బాలేమియా, పానుగంటి యోసేపు, పరమేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



పాన్‌గల్: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల సంభవించే అంటువ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీ ద్వారా అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: ముసురు వర్షాలు కురుస్తున్న సందర్భంగా గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత ఆశావర్కర్లపై ఉందని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైద్య నిబంధనలకు అనుగుణంగా గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఆశా వర్కర్లు పని చేయాలని ఆదేశించారు.

నిస్తేజంగా నిఘా నేత్రాలు

- పాన్‌గల్‌లో పనిచేయని సీసీ కెమెరాలు
- కొరవడిన పర్యవేక్షణ
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం



పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్



పాన్‌గల్ అంబేడ్కర్ చౌరస్తాలో పనిచేయని సీసీ కెమెరాలు

పాన్‌గల్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో సీసీ కెమెరాలు అమర్చుకునేలా చైతన్య పరిచారు. నేరాల అదుపునకు నిఘా నేత్రాలు దోహదం చేస్తాయనే ఉద్దేశ్యంతో మండలంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు చందాల రూపంలో నగదు జమ చేసి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణ బాధ్యత మాత్రం పోలీసులదే. ఇంత ఖర్చు పెట్టి ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు మూన్నాళ్ల ముచ్చటగానే మారాయి. కొన్ని నెలలుగా కెమెరాలు పనిచేయకపోవడంతో మండల కేంద్రంలో నిఘా కొరవడింది. ఏదైనా దొంగతనాలు, ఘటనలు జరిగితే ఎలా అని మండల వాసులు ఆందోళన చెందుతున్నారు.

నేరాల నియంత్రణ కోసమే..

మండల కేంద్రం జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉండటం, కొల్లాపూర్ వెళ్లేందుకు పాన్‌గల్ మీదుగా ఉన్న రోడ్డు దూరం తగ్గుతుండడంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఇతర ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి ఎంతో మంది వచ్చి వెళ్తుండటంతో దొంగతనాలు, పోకరీల బెడద, అనుమానితుల కదలికలు కనిపెట్టేందుకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా.. సరైన పర్యవేక్షణ లేక అవి నిరూపయోగంగా మారాయి.

ఏయే ప్రాంతాల్లో..

పోలీస్ స్టేషన్ సమీపంలో, బస్టాండ్ చౌరస్తా, సంతబజార్, శాగాపూర్ వెళ్లే దారిలోని ఈదమ్మ గుడి, కల్లు దుకాణం, కొల్లాపూర్ వెళ్లే రోడ్డులోని గ్రామ పంచాయతీ వద్ద, వనపర్తికి వెళ్లే దారిలోని అంబేడ్కర్ చౌరస్తా ప్రాంతాల్లో కలిపి 22 సీసీ కెమెరాలు, అన్నారం, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా, మల్లాయిపల్లి, రేమద్దుల తదితర గ్రామాల్లోని 42 ప్రధాన కూడళ్లలో మొత్తం 64 కెమెరాలు ఉన్నాయి. వీటిలో పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న కెమెరాలు తప్ప మిగతావి ఎక్కడ పనిచేయడం లేదు.

పట్టించుకోని పోలీసులు..

దాతలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అవి నిరూపయోగంగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏర్పాటుకు చూపిన ఆసక్తి వాటి మరమ్మతును పోలీసులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు మరికొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు బిగించేందుకు విరాళాలు స్వీకరించి ఏర్పాటు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మరమ్మతులు చేయాలి



మండల కేంద్రంలో పనిచేయకుండా నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతు చేయాలి. సీసీ కెమెరాలు పనిచేస్తే దొంగతనాలు, నేరాలు నియంత్రణకు అడ్డుకట్ట పడుతుంది. వాటిని వినియోగంలోకి తీసుకవచ్చేందుకు పోలీసులు శ్రద్ధ చూపాలి.

– పరమేశ్‌యాదవ్, కిరాణం, పాన్‌గల్

పట్టించుకోవడం లేదు



గ్రామ పంచాయతీ, దాతల సహకారంతో గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని నెలలుగా పనిచేయడంలేదు. మరమ్మతుల విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో కెమెరాలు నిరుపయోగంగా మారాయి. ఏర్పాటు సమయంలో చూపిన శ్రద్ధ మరమ్మతు విషయంలో చూపడం లేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకరావాలి.

– జయకళ, సర్పంచ్, మల్లాయిపల్లి

వినియోగంలోకి తీసుకొస్తాం



మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పనిచేయని విషయం వాస్తవం. ముఖ్యంగా మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో కెమెరాల వైర్లను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మరమ్మతు విషయంపై ఆయా గ్రామాల దాతలు, స్థానిక ప్రజాప్రతినిధులతో మరోమారు చర్చించి వాటిని వినియోగంలోకి తీసుకవచ్చేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

– వేణు, ఎస్‌ఐ, పాన్‌గల్

మనిషి మనుగడ మట్టిలోనే..



ర్యాలీ నిర్వహిస్తున్న మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

- ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య

కొత్తకోట రూరల్: మనిషి మనుగడ మట్టిలోనే కొనసాగుతుందని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య అన్నారు. ప్రపంచ మట్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జాతీయ సేవా పతకం ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సైదయ్య మాట్లాడుతూ.. ఆరోగ్య నేలలే భవిష్యత్ తరాలకు జీవనాధారమని.. నేల ఆరోగ్య సంరక్షణ ప్రజలందరి బాధ్యతని, అందుకు ప్రతి ఒక్కరూ మట్టిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.బేబిరాణి, డా. జి.విద్య, డా. పూర్ణిమ మిశ్రా, డా. శ్రీనివాస్, చంద్రశేఖర్, గౌతమి, భాగ్యశాలి తదితరులు ఉన్నారు.

నర్సరీల్లో ముమ్మరంగా మట్టి నింపే పనులు

ఖిల్లాఘనపురం: గ్రామాల నర్సరీల్లో పాలిథిన్ కవర్లలో మట్టి నింపే పనులు త్వరితగతిన పూర్తిచేసి విత్తనాలు నాటేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని అల్లమాయపల్లి నర్సరీని ఆయన సందర్శించి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలోనే విత్తనాలు ఎంపిక చేసి నాటిస్తామని తెలిపారు.



బోధన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి

- డీఈఓ నరహరి

అమరచింత: ఉపాధ్యాయులు దృష్టి సారించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాల్సిన అవసరం ఉందని డీఈఓ నరహరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి బోధన విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భాష, గణిత సామర్థ్యాలను నిత్యం అనుసరించాలన్నారు. తొలిమెట్టు కార్యక్రమం ప్రవేశపెట్టింది విద్యార్థుల ఉన్నతి కోసమేనని.. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి రోజు టీచర్ గ్రూప్‌లో ఉన్న విద్యార్థులతో చదివించాలని సూచించారు. వారంలో అయిదు రోజులు పాఠాలు బోధించడం.. ఆరోరోజు పరీక్ష నిర్వహించడం వంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా అమలు చేయాలని కోరారు. విద్యార్థుల చేతిరాతపై దృష్టి సారించాలని, రోజు గంటపాటు లైబ్రరి పుస్తకాలు అందించి చదివించాలని తెలిపారు. టీఎల్‌ఎం సాయంతో అర్థవంతమైన బోధన అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బలరాముడు, సీఆర్పీ స్వామి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ నరహరి

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య..

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా బోధన అందిస్తున్నామని జిల్లా విద్యాధికారి నరహరి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించేస్థాయికి ఎదగాలన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్నతి, 10వ తరగతి విద్యార్థులకు లక్ష్య కార్యక్రమాల చదవడం, రాయడం, సబ్జెక్టుల వారీగా సులభతర బోధన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



కొత్తకోటలో నినాదాలు చేస్తున్న కార్యకర్తలు



వనపర్తిలో..

వనపర్తిటౌన్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించిన సందర్భంగా మంగళవారం రాత్రి జిల్లాకేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇక నుంచి అన్నివర్గాల అభివృద్ధి మొదలవుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో మంగళవారం రాత్రి కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీను ఆధ్వర్యంలో కొత్తకోట చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, రేవంత్‌రెడ్డి అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాతే పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని.. ప్రజలు సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను నమ్మి ఓట్లు వేశారన్నారు.

కొత్త ఎమ్మెల్యేలకు సన్మానం



ఎమ్మెల్యేలతో ఎన్‌ఆర్‌ఐ అమర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని సంకిరెడ్డిపల్లికి చెందిన ప్రవాస భారతీయుడు అమర్‌రెడ్డి కొత్తగా ఎన్నికైన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి పాటుపడాలని కోరారు.

వ్యవసాయ విద్యార్థుల క్షేత్ర ప్రదర్శన

గోపాల్‌పేట: రేవల్లి మండలం చెన్నారం గ్రామంలో హైదరాబాద్ మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. పంటలకు ఆశించిన తెగుళ్లను పరిశీలించి ఎరువులు, పురుగు మందులు ఎంత మోతాదులో వినియోగించాలో వివరించారు. 20 రోజులుగా గ్రామంలోనే ఉంటూ రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. విద్యార్థినులు షేక్ రమీజా, గౌతమి, స్వాతి, సాయిప్రియ, సుప్రజ, మౌనిక, దివ్య, మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు భవాని, అనిత, మల్లారెడ్డి, ప్రొఫెసర్లు డా. గ్రీష్మ, డా. హరీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న విద్యార్థులు

ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌ను గెలిపించాయి

కొత్తకోట: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పనిచేశాయని టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్ అన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బీచుపల్లియాదవ్‌తో కలిసి మంగళవారం కొత్తకోటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పి.ప్రశాంత్ మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు మేలు చేకూరుతుందనే విశ్వాసంతో ప్రజలు ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రావుల జితేంద్రనాథ్‌రెడ్డి, సలీంఖాన్, ధన్వాడ బాలస్వామి, లతీఫ్, మిషేక్, నరేందర్‌సాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మస్తాన్ తదితరులు ఉన్నారు.

మదనాపురం: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా దేవరకద్రలో జి మధుసూదన్‌రెడ్డి గెలుపొందడంతో దుప్పల్లి, అజ్జకొల్లు ఆలయాల్లో కాంగ్రెస్ నాయకులు పూజలు నిర్వహించారు. అజ్జకొల్లు శివాలయంలో 101 బిందెల నీటితో స్వామివారికి జలాభిషేకం, దుప్పల్లి గ్రామంలో పోచమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వనపర్తి టౌన్: నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మేఘారెడ్డి గెలుపొందినందున 7వ వార్డుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త మన్యం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పీర్ల గుట్టలో ఉన్న ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహించి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ తెలిపారు.



పీర్లగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దుప్పల్లిలో పోచమ్మ ఆలయంలో..

కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, రాము, కాంతుకుమార్, మహేష్, కార్తీక్, రవి, మన్నెకొండ, వెంకటేష్, ఏర్పుల రాములు, శివ, రాఘవేంద్ర, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మరోమారు కొల్లాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంపై మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసిన నాయకులు రాష్ట్ర ఏర్పాటులో జూపల్లి కృష్ణారావుకు సంశిత స్థానాన్ని ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్ కోరారు. కార్యక్రమంలో నక్క విష్ణు, తెలుగు గంగయ్య, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో రహ్మతుల్లా

అమరచింత: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ గీతకార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన శ్రీహరికి అధిష్టానం సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మక్తల్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే మంత్రి ఇవ్వాలని కోరారు.

అమరచింతలో సంబురాలు...

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని అధిష్టానం ఖరారు చేయడంతో పట్టణంతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువత సంబురాలు నిర్వహించారు. బైక్‌లతో ఊరేగింపు నిర్వహించి సీఎం రేవంత్ అంటూ నినాదాలు చేశారు. చౌరస్తాలో బాణాసంచా కాల్చారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఆత్మకూర్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు రహ్మతుల్లాతో పాటు మండల నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులను కాపాడాలి

పాన్‌గల్: మిచాంగ్ తుపాన్ వల్ల రైతులకు నష్టం జరగకుండా కాపాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాకం బాలస్వామి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తుపాన్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో ముసురు వర్షాలు కురుస్తున్నాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు లేక ధాన్యం తడుస్తోందని రైతులు వాపోతున్నారు. అలాగే కోతకు వచ్చిన వరి పంటలు నేలకొరిగి గింజలు రాలుతున్నాయని వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కాపాడేందుకు అవసరమైన టార్పాలిన్ కవర్లను అందించాలని కోరారు.

నిరుపయోగంగా రైతువేదికలు

- పట్టించుకోని అధికారులు

అమరచింత: నాగల్‌కడ్మూర్, పాంరెడ్డిపల్లి, నందిమళ్ల క్యాంప్‌కాలనీలో నిర్మించిన రైతువేదికలు నిరుపయోగంగా మారాయి. రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర నిధులు వెచ్చించి ఒక్కొక్కటి రూ.20 లక్షలు వెచ్చించి నిర్మించారు. వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ అధికారులకు ఉపయోగపడే విధంగా వీటిని నిర్మించారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో దుమ్ము, ధూళితో నిండటమేగాక కిటికీలు, తలుపులు విరిగిపోతున్నాయి. అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పాంరెడ్డిపల్లిలోని రైతువేదిక